విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 30, మార్చి 2025

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

దేశవాళి వరి వంగడాలను సాగుచేయండి

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలోని రైతు బాల మద్దిలేటి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలనిచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించడం వల్ల అధిక లాభాలు రావడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించిన వారమవుతామన్నారు. దేశవాళి వరి వంగడాలను సాగుచేసే విధానం, ప్రకృతి వ్యవసాయ నిబంధనలు పాటించడం ద్వారా రైతులకు వచ్చే నికర ఆదాయాన్ని బాల మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ ఆపరేషన్‌పై డ్రోన్ పైలట్ గా శిక్షణ పొందిన సునీత ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన జీవామృతం పిచికారిని డ్రోన్ ద్వారా కలెక్టర్ సమక్షంలో ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. డ్రోన్ వినియోగం ద్వారా వ్యవసాయ కార్మిక లోటును అధిగమించి, సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు, సమర్థవంతంగా పెస్టిసైడ్, జీవామృతాన్ని పంటలపై పిచికారీ చేయవచ్చని అలాగే ఈ వినూత్న ప్రయోగం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేయడానికి అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బాల మద్దిలేటి ఇన్పుట్ షాపును కూడా సందర్శించి, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఆళ్లగడ్డ డివిజన్ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, మండల వ్యవసాయ అధికారి, గ్రామ సర్పంచు, ఇతర వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలందరికి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఈ ఏడాది అంతా జిల్లా ప్రజలు సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శనివారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు ఉగాది పండుగ పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీ అధోగతి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు సర్వసభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావే శంలో 21అంశాలపై చర్చించగా 20అంశాలపై ఆమోదం తెలిపిన కౌన్సిలర్లు, ఒక అంశాన్ని పెండింగ్లో ఉంచారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా వచ్చిన శాసనసభ్యుడు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి పనులపై చర్చించి ఆమోద సూచనలు చేయవలసిన వైసిపి కౌన్సిలర్ సభ్యులు సమావేశాలకు హాజరుకాకుండా వైసిపి సొంతింటి ఆడబిడ్డ అని చూడకుండా చైర్మన్ పీఠంపై పదవి కాంక్షలతో విహారయాత్రలు చేస్తున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చైర్మన్ పదవి కాలం ఉన్నంతవరకు ఆవిడని చైర్మన్ పీఠంలో ఉండేలా చూస్తామని అలా కాదని వైసిపి కౌన్సిలర్లు ఎవరైనా వస్తే వారి సంగతి కూడా చూస్తామని చైర్ పర్సన్‌కు హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు సహకరించరు కానీ కమి షన్లు అడుగుతారా అంటూ వైసీపీ కౌన్సిలర్లపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన 8నెలల్లోనే మున్సిపాలిటీకి రూ.3కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసిన ఘనత తమదని వెల్లడించారు. మరో రూ.2కోట్ల విడుదలకు మున్సిపల్ మంత్రి అంగీకారం ఉందని త్వరలోనే అవి కూడా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. మున్సిపల్ సమావేశానికి హాజరై అజెండా ఆమోదానికి సహకరించిన కౌనిలర్లను కూడా అయన అభినందించారు.

డోన్ మున్సిపాలిటీలో గోల్ మాల్

- దిన, వారపు సంత, జంతు వధ శాల బస్టాండ్ వేలాలు
- రింగుగా ఏర్పడిన గుత్తేదారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : వారంతా ఒక్కటే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా టెండర్లు వేశారు. శుక్రవారం జరిగిన డోన్ మున్సిపల్ పరిధిలోని దిన, వారపు సంతతో పాటు జంతు వధ శాలలు, బస్టాండ్ వేలం పాటలలో గుత్తేదారులు ఒక్కటై టెండర్లు తగ్గించుకున్నారు. ఈనెల 21,22వ తేదీలలో బహిరంగ వేలం పాటల నిర్వహించగా ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే పాల్గొనడం వలన మున్సిపల్ కమిషనర్ వేలాలను వాయిదాలు వేశారు. చివరికి 28వ తేదీ కాంట్రాక్టర్లు అందరూ ఏకమై రహస్య టెండర్ బాక్సులలో కోట్ వేశారు. ఈ ఏడాదికి మొత్తం రూ.36 లక్షల ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాల్సి ఉండగా గుత్తేదారులు కేవలం రూ.19.10 లక్షలకు మాత్రమే కోట్ చేసి టెండర్ దాఖలు వేశారు. మున్సిపల్ నిబంధనల మేరకు దిన,వారపు సంతలతో పాటు బస్టాండ్, జంతువధ శాలల రుసుము వసూళ్లకు రూ.36 లక్ష్యాలు ధరావత్తు చెల్లించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. రూ.13 లక్షలు ,వారపు సంత రూ.6 లక్షలు, బస్టాండ్ రూ.15 లక్షలు, జంతువధశాలలకు రూ.2లక్షలు నిర్ణయించారు. అయితే కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై చిరు వ్యాపారులను నిలువు దోపిడి చేసేందుకు రింగ్‌గా ఏర్పడి దినసరి సంతను రూ.7.40 లక్షలు, వారపు సంత రూ 3లక్షలు, బస్టాండ్ రూ 6.70 లక్షలు, జంతువధ శాల రూ 2 లక్షల మొత్తం కలిపి రూ 19.10 లక్షలకు మాత్రమే టెండర్లు దాఖలు చేశారు.

కౌన్సిల్ తీర్మానం పొందితే అంతే సంగతులు : శుక్రవారం నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టు వేసే వారికి ఉదయం 10నుండి 12గంటల వరకు మాత్రమే టెండర్ల వేయాలని సమయం ఇచ్చారు. కానీ కాంట్రాక్టు వేయడానికి వచ్చినవారు 10నిమిషాలు సమయం ఇవ్వాలని కోరగా కమిషనర్ ఏకంగా 1గంట వరకు సమయం పెంచారు. మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేందుకు గుత్తేదారులు అంతా ఒక్కటి కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి రావలసిన ఆదాయం పడిపోతే పట్టణంలో అభివృద్ధి పనులు ఎలా చేపడతారని అందువల్ల రాబోయే కౌన్సిల్ సమావేశంలో ఈ టెండర్లను కౌన్సిలర్లు తిరస్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్‌సంస్థలో మీటర్ రీడింగ్లు తీస్తున్న వారికి ఉద్యోగ భద్రత,నెల వారి వేతనాలు ఇవ్వాలని విద్యత్ మీటర్ రీడర్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.స్థానిక విద్యుత్ కేంద్రంలో వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థనే నమ్ముకొని సుమారు 10నుండి 15సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి విద్యుత్ మీటర్ రీడర్స్, స్మార్ట్ మీటర్స్ బిగిస్తున్న తరుణంలో మీటర్ రీడర్లుకు వేతనాలు తగ్గుతున్నాయన్నారు. అలాగే ఉపాధి కోల్పోయి రోడ్డున పడకుండా విద్యుత్ సంస్థలోని ప్రత్యామ్నాయ ఉపాది కల్పించాలని డిమాండు చేసారు. ఎస్కో అకౌంట్ ద్వారా ప్రతి నెల వేతనాలు చెల్లించాలని ఎన్నిసార్లు యాజమాన్యం దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు.మీటర్ రీడర్స్ ను ఐటిఐ అర్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్ గాను, అలాగే వాచ్ అండ్ వార్డ్ గా,ఎం.ఆర్.టి లో స్కిల్డ్ అండ్ అన్ స్కిల్డ్ వర్కర్‌గా, అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్స్ గాను, అటెండర్స్ గాను, వాచ్మెన్ గాను, డ్రైవర్లు గాను, బ్రేక్ డౌన్ గ్యాంగ్ నియమించటం వలన ట్రీ కటింగ్, మెయింటెనెన్స్ డిలిస్టులకు, మీటర్లు మార్చడంలో ఉపయోగించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గత నెల 20న తిరుపతి లో జరిగిన మహాసభలో రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు ఏప్రిల్ 1నుంచి సమ్మె బాట పడుతున్నామన్నారు.అనంతరం విద్యుత్ ఏఈ రమణయ్యకు సమ్మె నోటీస్ అందజేసారు.కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ విశ్వం,రఫి,సుబ్రమాణ్యం,మహమ్మద్‌హుస్సేన్,చిన్నఓబులేసు,దస్తగిరిలు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : వచ్చే నెల 6వ తేదీన శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని బనగానపల్లె పట్టణంలో ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో సన్నాహక ఏర్పాట్లను రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పరిశీలించారు. మంత్రి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో సొంత నిధులతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమానికి దాదాపు 4నుండి 5వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నది. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి మురళి మోహన్ రెడ్డి, సీఐ మంజునాథ రెడ్డిలు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఉగాది, రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఎల్‌కెఆర్ గ్లోబల్ స్కూల్ నందు ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో పిల్లలు తమ నృత్యాలతో, ఆటపాటలతో నాటక ప్రదర్శనలతో ఉగాది, రంజాన్ పండుగ యొక్క విశిష్టత గొప్పతనం గురించి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు చదువుకు ఎంత ప్రాముఖ్యతనయితే ఇస్తారో పిల్లలకు నృత్యాలపై, పాటలు నేర్పించడంలోనూ, ఆటలలోనూ అంతే ప్రాముఖ్యతను ఇస్తామన్నారు. తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఏవో రమణ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

ఈద్గా స్థలంలో పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య రంజాన్ పండుగ జరుపుకొనే సందర్భంగా శనివారం ఈద్గా పరిసరాలను ఈద్గాకు వెళ్లే ప్రతి దారిని పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు శిరివెళ్ల మేజర్ పంచాయతీ ఈవో అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈద్గా ఆవరణంలో పరిసరాలలో రహదారులపై నెలకొని ఉన్న చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ కవర్లను తొలగించి ప్రార్థన ఏర్పాట్లకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఈఓ తెలిపారు. సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇఓ పేర్కొన్నారు. శిరివెళ్ల ప్రధాన రహదారి నుండి పోలీస్ స్టేషన్, షాది ఖానా, గోవింధపల్లె రొడ్డును ఈద్గా మైదానాన్ని శుభ్రం చేశారని అన్నారు. ఈద్గా మైదానంలో వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలకు హాజరుకానున్న ఈ నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌తో పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఇఓ అశ్వని కుమార్ తెలిపారు.

డ్రోన్ దెబ్బ.. పేకాటరాయుళ్ల అబ్బా

విశాలంధ్ర - శ్రీశైలం : శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల కొచ్చి జూదం ఆడుతూ సీసీ కెమెరాలకు డ్రోన్‌లకి దొరికిన పేకాట రాయుళ్లను శ్రీశైలం వన్ టౌన్ సిఐ జి.ప్రసాద్ రావు ఆధ్వర్యంలో తమ సిబ్బంది టెక్నాలజీని ఉపయోగించి శ్రీశైలంలో కుమారస్వామి పార్కింగ్ స్థలం హెలిపాడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలం గోశాల వద్ద బాల గణేష్ వనంలో జూదం ఆడుతున్న 24మంది జూదరులను వారి నుండి 62,310 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం వన్ టౌన్ సిఐ జి.ప్రసాదరావు తెలిపారు.

మినీ వాటర్ ట్యాంకులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని వాకిటి పేట, ఆసార్ మజీద్ అమ్మవారి శాల దగ్గర మంచినీటి మినీ వాటర్ ట్యాంకులను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఆత్మకూరు పట్టణంలో మంచినీటి సమస్య లేకుండా ప్రజలకు ఎల్లప్పుడూ ఈ మినీ వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సమస్య తీరుతుందని, వేసవిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మారూఫ్, టీడీపీ వార్డ్ ఇంచార్జ్ నాయకులు టపాల్ అష్రఫ్ అలి, అమ్మల్లా, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రభోత్సవం

నంది వాహన సేవ మహా సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చిన శివపార్వతులు..

వీరాచార్య విన్యాసాలు అగ్నిగుండ ప్రవేశం

విశాలాంధ్ర - శ్రీశైలం : ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడవరోజు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు స్వామివారి యాగశాలలో చండీశ్వర పూజ మండపారాధనలు లోక కళ్యాణం కోసం రుద్రహోమం అమ్మవారి ఆగస్టు నెలలో చండీ హోమం విశేష కుంకుమార్చన నవవర్ణార్చనలు అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంకాలం స్వామి అమ్మవార్లకు ప్రభోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అలంకరణ పూజలు అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ మంగళ వాయిద్యాలు నడుమ గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవంలో స్వామి అమ్మవార్ల ఉత్తమ మూర్తులను చూసి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు నీరాజనాలు పలికారు. శ్రీశైల పురవీధుల్లో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ఎంతో వైభవంగా సాగింది. ఈ గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి శివ దీక్ష శిబిరాల వద్ద కనడ భక్తులచే అగ్నిగుండ ప్రవేశం సాంప్రదాయాన్ని అనుసరించి వీరాచార్య విన్యాసాలు వీర శైవ భక్తులు వీరభద్ర ప్రవచనాలు పట్టిస్తూ ప్రత్యేకవేషధారణలో వివిధ వాయిద్యాలు నడుమ విన్యాసాలు చేశారు. అనంతరం కన్నడ భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన బార్ అసోసియేషన్ సభ్యులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను శనివారం ఆమె కార్యాలయంలో నూతన బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డితో కూడిన ప్యానెల్ గెలవడం జరిగింది. నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎమ్మెల్యే అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన బార్ అసోసియేషన్ సభ్యులు టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్‌ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శశిధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లెలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర పాఠశాల కేవలం పునాదులకే పరిమితైందని పెండింగ్లో ఉండే నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ సిద్ధాంతాలకు, ఉద్యమాలకు ఆకర్షితులై పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే 15 మంది విద్యార్థులు చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందు, మహేష్,మనోజ్, రమేష్,చెర్రీ,సుదర్శన్,సందీప్, సర్వానంద్,సూర్య, తిరుమలేష్,బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చందాలంటే టీడీపీతోనే సాధ్యమని మాజీ సర్పంచ్ టీడీపీ సీనియర్ నాయకులు మండడి నారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తరిగోపుల గ్రామంలో తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బస్టాండులో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గిరీశ్వర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు మండడి దొరబాబు రెడ్డి, కోట్ల ఆదినారాయణ రెడ్డి, కురువ శ్రీరాములు,ఎల్లమ్మ నాయుడు, లక్ష్మన్న, బాబురావు,పెద్ద చింతన్న, తిరుపతయ్య,నాగార్జున, టైలర్ కృష్ణ,టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా ఊరు, వాడలా టీడీపీ జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీనివాస్ సెంటర్ ఎన్టీఆర్ కాంప్లెక్స్ దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి బృందం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడిపి కార్యాలయం నందు జెండా ఆవిష్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జిల్లెల్ల శ్రీరాములు, ఎవిఆర్ ప్రసాద్, నంద్యాల మార్కెట్ యాడ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, గ్రామ, వార్డు టిడిపి ఇన్చార్జిలు తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర- బనగానపల్లె : టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ 43 ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధ్యక్షుడు టంగుటూరి సీనయ్య, ఉప సర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షుడు కాసింబాబు, ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్, టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: టీడీపీ అంటేనే నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం అని నిరూపించిన నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి హాజరై గౌడ్ సెంటర్‌లో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి, జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీనియర్ నాయకులు గోవిందా రెడ్డి, వంగాల శివరామి రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు వేణు, మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, పట్టణ కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, నాయకులు సతీష్, నూరు బేగ్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు గంగ ప్రధాన కాలువ మన ప్రాంతంలో వెళ్లడం వల్లే ఆళ్లగడ్డ నియోజకవర్గం రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు స్వర్గీయ ఎన్టీఆర్ కు నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర- కోయిలకుంట్ల: పట్టణ పరిధిలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి టిడిపి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, ఆమడాల మద్దిలేటి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : బడుగు బలహీన వర్గాలకు అండ టిడిపి జెండా అని అపార్టీ నేతలు అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో 43వ టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నందు టిడిపి మండల అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, అంకిరెడ్డిపల్లిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, పెట్నికోటలో మండల తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి తదితరులు టిడిపి జెండాను ఎగురవేశారు.

విశాలాంధ్ర - వెలుగోడు : టీడీపీకి కార్యకర్తలే బలమని టీడీపీ మండల అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి, మైనార్టీ నాయకులు డా.జాకీర్ హుసేన్ అన్నారు. పట్టణంలో ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు అమీర్ హంజ చేత జెండా ఆవిష్కరణ గావించారు. తరువాత డిగ్రీ కాలేజీ వద్దగల ఎన్టిర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర-అవుకు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అవుకు మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి ,టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జీసిసి డైరెక్టర్ అరుణకుమార్ నాయక్, తిక్కన్న,దంతల రమణ, మద్దిలేటి గౌడ్,జయ శివుడు రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని శ్రీపతిరావు పేట గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు నాగార్జున ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ల ఆశా జ్యోతి నందమూరి తారక రామారావు స్థాపించిన టీడీపీ 43 సంవత్సరాల సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి పెద్ద ఎత్తున జెండాను ఆవిష్కరించారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 30, మార్చి 2025

జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, కర్నూలు నగర మునిసిపల్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబులు ప్రజలకు ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంత్రి రాష్ట్ర, జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని మంత్రి ఆకాంక్షించారు. మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ పండుగ అని, సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని, ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరుల కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా ఆచరించే ఉపవాసం, దైవ ప్రార్థనలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని వారు తెలిపారు.

రసభసగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల కేంద్రమైన క్రిష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం అన్ని శాఖల అధికారులతో వైస్ ఎంపీపీ బోయ సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం కాసేపు రస భసగా కొనసాగింది. తమ గ్రామంలో బెల్టు షాపులు తొలగించాలని మండలానికి మద్యం షాపు వస్తే అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం ఏమిటని సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్ ఎక్సైంజ్ ఎస్సై చంద్రమోహన్‌ను ప్రశ్నించారు. వెంటనే నాటు సారా, బెల్ట్ షాపులు లేకుండా అరికట్టాలన్నారు. గ్రామానికి గోకులం షెడ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు కట్టించుకోవడానికి వెళ్తే వాటిని తొలగించారని, మంజూరు చేయడం మీ ఇష్టమే, తొలగించడం మీ ఇష్టమేనా అని ఉపాధి ఏపీఓను సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్ అడిగారు. కటారుకొండ గ్రామంలో తాగునీటి ఎద్దడిని అరికట్టాలని సర్పంచ్ నక్కిలేని బాబు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. ఎస్టీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది పునరుద్ధరించాలి సచివాలయం నిర్మించాలని మండల అధికారులకు లెనిన్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్య వైద్యం ఉపాధి పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని వారికి సూచించారు. సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలన్నిటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఏఈ జాకీర్ హుస్సేన్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి హరినాథ్, ఎంఈఓ 2 మద్దయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్, సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర -మంత్రాలయం: ఏప్రిల్ 4వ తేదీన కర్నూలులో జరిగే జాతీయ రైతు సభను జయప్రదం చేయాలని శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మంత్రాలయం చెట్నపల్లి మాధవరం సర్కిల్ నందు జీపు జాత నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.విజయభాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, మాలిక్ బాష పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుల దస్తగిరి, రైతులు నాగరాజు, రవి, నరసింహులు, తిక్కన్న, డోలు హనుమంతు, వీరేష్, ఎర్రన్న, బాబు తదితర రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల తహశీల్దార్ పురుషోత్తముడు అన్నారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల వీఆర్వోలతో సమావేశం నిర్వహించి, తహశీల్దార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల వీఆర్వోలు తమ గ్రామాల్లో ఎండ తీవ్రత, వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తప్పకుండా వీఆర్వోలు గ్రామాలలో పర్యటిస్తూ చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త పడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని వీఆర్వోలను ఆదేశించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-గూడూరు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల తహశీల్దార్ కె.రామాంజనేయులు అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో గూడూరు చైతన్య యూత్, మాజీ జెడ్పీసీఎల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ కె.రామాంజనేయులు, డీటీ ధనుంజయ రెడ్డి ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్ సభ్యులు ములగేరి మద్దిలేటి, విశ్వనాథ ఆచారి, సాక్షి శ్రీనివాసులు, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాఘువేందర్ రెడ్డి, వీఆర్వోలు కృష్ణారెడ్డి, జయరాముడు, మధు కృష్ణ, హరిరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర కర్నూలు - వైద్యశాల: నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ లెక్చరర్ హాల్లో జూనోటిక్ వ్యాధులపై శనివారం ఉదయం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని మైక్రో బయాలజీ విభాగధిపతి డాక్టర్ రేణుకా దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి మరియు ఈ జూనోటిక్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను సీఎం ఈ ప్రోగ్రాం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ చక్రపాణి, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ, సమగ్ర చట్టం తీసుకురావాలి

విశాలాంధ్ర - దేవనకొండ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తూ, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు వై.కండప్ప, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సి.కృష్ణ, కౌలు రైతు సంఘం నాయకులు రామాంజనేయులు, కోదండ, సుల్తాన్‌లు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం దేవనకొండ రైతు భరోసా కేంద్రం ముందు ఆందోళన నిర్వహించి, అనంతరం అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగాచారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం నూతన సమగ్రమైన చట్టాన్ని వెంటనే తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు వీరాంజినేయులు, రఫీ, మద్దిలేటి,గోపాల్, బాబు, బాష, రమేషు, లక్ష్మయ్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఉగాది రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలకనున్న నేపథ్యంలో స్థానిక మాధవ్ నగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్యక్షతన శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండగ సంబరాలు ఘనంగా నిర్వ హించారు. వేడుకలకు క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ భాష ముఖ్య అతిథిగా హాజరై విధ్యార్థులకు ఉగాది, రంజాన్ పండగల విశిష్టతను వివరిం చారు. ఉగాది పచ్చడి, అందులోని ఆరు రుచులు మన జీవితంలో ఎదురయ్యే కష్ట నష్టాలను, మంచి, చెడులను సమానంగా స్వీకరించాలని గుర్తు చేస్తాయన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమని, ముస్లింలు అత్యంత పవిత్రమైందిగా భావిస్తారన్నారు. ఏడీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, రాధ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం : ఎంపీపీ

విశాలాంధ్ర-పత్తికొండ: మండలంలోని పెళ్లిమాన్ తాండలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీవో సువర్ణలత తెలిపారు. శనివారం పెళ్లిమాన్ తాండలో సర్పంచ్ లక్ష్మీ నాయక్‌తో కలిసి తాగు నీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో మండల గ్రాంట్ నిధులు రూ.2.30 లక్షల వ్యయంతో తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టి మంచినీటి సమస్యను తీర్చడం జరిగిందన్నారు. గ్రామస్తులు ఎంపీపీ, ఎంపీడీవో లను శాలువా, పూలమాలలతో సన్మానించి, హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డి పదవి విరమణ వీడ్కోలు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో శనివారం మధ్యాహ్నం సర్జరీ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డి పదవీ విరమణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర రాష్ట్ర ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర -గోనెగండ్ల: రైతులు పండించిన మిర్చీ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.పంపన్నగౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 4న కర్నూలు నగరంలో జాతీయ రైతు సదస్సు కరపత్రాలను సీపీఐ కార్యాలయం ముందు విడుదల చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాల అవలంబిస్తూ రైతంగం పండించిన పంటలు గిట్టుబాటు కల్పించడంలో విఫలమైంది అని అన్నారు. ఏప్రిల్ 4వ తేదీన కర్నూలు నగరంలో జాతీయ రైతు సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలుకా రైతు సంఘం నాయకులు మాలిక్, శాంతన్న, సీపీఐ మండలకార్యదర్శి నాగప్ప, గిడ్డయ్య, రాము, హనుమంతు, వీరేష్, తమన్నా పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: కర్నూలు నగరంలో ఏప్రిల్ నాలుగవ తేదీన ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరగబోయే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మిగనూరులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచార జీపు కార్యక్రమాన్ని ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో నిర్వహించడం జరిగిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, జిల్లా కోశాధికారి కేసీ జబ్బర్ తెలిపారు. రైతు సంఘం నాయకులు మాలిక్, శాంతప్ప, గిడ్డయ్య, దాదావలి, మల్లికార్జున గౌడ్, నరసింహులు, వీరేష్, ఎల్లప్ప, రాము, హనుమంతు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఈద్గలో చెత్తా, వ్యర్థాలు తొలగింపు

విశాలాంధ్ర - హొళగుంద: ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ పండుగ జరగనున్న సందర్భంగా సర్పంచ్ చలువాది రంగమ్మ ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ శనివారం ముస్లిం సోదరుల మూడు ఈదుగాలలో చెత్తను జేసీబీ ద్వారా తొలగించారు. రాస్తాకు ఇరువైపుల పెరిగిన కంప చెట్లను తొలగించి కాల్చివేశారు. ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకున్నామని గ్రామ కార్యదర్శి రాజ శేఖర్ గౌడ్ శనివారం తెలిపారు. ఈదుగలను పంచా యతీ సిబ్బంది ద్వారా పరిశుభ్రంగా ఉంచామని తెలి పారు. మండలంలోని ముస్లిం సోదరులు ఈద్గాలకు కొత్త రంగు పూసి, రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. హొళగుంద ఈద్గ మరమ్మత్తు కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సుభాన్, సున్నతుల్ జమాత్ పెద్దలు కాసిం వలి, శాలి షబ్బీర్, గూడు సాబ్, తదితరులు పాల్గొన్నారు. ఈద్గాలను అన్ని హంగులతో ముస్తాబు చేసిన సర్పంచ్ చెరువాది రంగమ్మకు, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడకు ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

చలువ పందిర్లను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : బస్సు స్టాప్‌లలో ప్రయాణికుల కోసం చలువ పందిర్లను ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబును సీపీఐ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ కలిసిన వారిలో నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు అన్వర్, గిడ్డమ్మ, బీసన్న, నల్లన్న, కుమారు, శాఖ కార్యదర్శి రామాంజనేయులు ఉన్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండు, రాజ్ విహార్ సెంటర్, కలెక్టర్ కార్యాలయం ధర్నా గేటు వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు కమిషనర్ కు వివరించారు. ఏప్రిల్, మే నెలలో అత్యధిక ఎండలు మార్చి నెలలోనే మొదలు అవడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర బస్సుల కోసం వెయిట్ చేసే స్థలాల దగ్గర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నగరంలోని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న తహశీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు రవి, నర్సింహులు, కృష్ణ, తిక్కమ్మ తెలిపారు. శనివారం పెద్దకడబూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దకడబూరులో సర్వేనెంబర్ 377లో అప్పటి డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్ర గౌడ్ సమక్షంలో మే 11, 2023లో పొజిషన్ పట్టా ఇవ్వడం జరిగిందన్నారు. పట్టాకు స్థలం చూపాలని ఇప్పుడున్న తహశీల్దార్ గీతా ప్రియదర్శిని దృష్టికి తీసుకెళితే చూద్దాం, చేద్దామని అంటున్నారే తప్ప చేయడం లేదన్నారు. తాను మహిళా తహసీల్దార్‌ను ఎక్కువ మాట్లాడితే మీపై కేసులు పెడతామని అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుల సమస్యలు విన్నవిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరిగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై రైతులకు మద్దతుగా సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రోజు రోజుకు ఎండ వేడిమి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా శాఖల పరంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం హీట్ వేవ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో, ఎంపీడీవోలతో, తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకి రోజు ఎండ తీవ్రత పెరుగుతోందని, ప్రస్తుతం 40,41 డిగ్రీల నమోదు అయిందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యం, జడ్పీ సీఈవో, డీపీఓ, పీడీ డ్వామా, మెప్మా పీడీ, డీఆర్‌డీఏ పీడీ, ఐసీడీఎస్ పీడీ, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ తదితరులు ఎండ వేడిమి వల్ల ప్రజలకు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, ఎస్ఈ ఆర్డబ్ల్యూఎస్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమైన విద్యుత్ మీటర్ రీడర్లు

విశాలాంధ్ర - హొళగుంద: రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం ఆలూరు సబ్ డివిజన్ నందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సంతోష్‌కు మీటర్ రీడర్స్, సీపీఐ నాయకులు కలిసి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కరవర్గ సభ్యులు కె.భూపేష్ మాట్లాడుతూ ఆలూర్ సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు విద్యుత్ సంస్థనే నమ్ముకుని సుమారు 10 నుండి 15 ఏళ్లుగా పని చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ స్మార్ట్ మీటర్ బిగిస్తున్న తరుణంలో మీటర రీడర్లకు వేతనాలు తగ్గుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ల రీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నీటి తొట్టెలను నిర్మించండి

విశాలాంధ్ర - హొళగుంద: మండల కేంద్రంలోని ఎల్లెల్సీ కాలువలో నీరు ఉన్నంత వరకు ప్రజలకు, పశువులకు నీటి దాహం తీరుతుందని, కాలువలో నీటి సరఫరా ఆగిపోతే పశువులకు నీటి కొరత ఏర్పడుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు గాడి వీరభద్ర గౌడ, సాయిబేష్, సూరన్న, పాలాక్షి, తుంగభద్ర రైతు సంఘం నాయకుడు కృష్ణయ్య తెలిపారు. పశువులకు నీటి తొట్టెను ఏర్పాటు చేయాలంటూ సర్పంచ్ చెలువాది రంగమ్మ, గ్రామ కార్యదర్శి రాజశేఖర గౌడకు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఎల్లెల్సీ దిగువ కాలువ పక్కనే ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులోనే నీటి తొట్టెను నిర్మిస్తే పశువులకు నీటి దాహం తీరుతుందన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - ఓర్వకల్లు : టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని నన్నూరు కన్నామడకల గుట్టపాడు హుసేనాపురం తదితర గ్రామాలలో టీడీపీ నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆయాగ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు గోవింద రెడ్డి, గుట్టపాడు మోహనరెడ్డి, విద్యార్థి జేఏసీ నాయకులు శ్రీరాములు, కన్నమడకల సుధాకర్, బొల్లరామ్, వెంకటేశ్వర్లు, శరఫ్, శ్రీపతి బుజ్జప్ప, క్రిష్ణరెడ్డి, ఖరీంఖాన్, షాంశుద్దీన్, సర్కార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హొళగుంద: స్థానిక బస్టాండ్‌లో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించి, టీడీపీ జెండాను ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజా పంపన గౌడ, పంపావతి, దుర్గప్ప, వీరన్న గౌడ, తోక వెంకటేష్, ఎర్రి స్వామి, అబ్దుల్ సుభాన్, డీఎస్ బాష, మోయిన్, జాకీర్, దిడ్డి తిక్క స్వామి, దిడ్డి వెంకటేష్, సర్పంచ్ సుధాకర్, చాగప్ప, ఎల్లార్తి చిదానంద పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ పార్కులో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తలు కలిసి జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, చిన్న తిమ్మప్ప, బాలాజీ వెంకటేష్ ధనుంజయ, విద్యా కమిటీ చైర్మన్ గోవిందు, బాష, దూదువలి, భీమన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ మండల నాయకులు ఇంద్రసేనా రెడ్డి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు మబ్బు ఆంజనేయ, కటికె బాబు, ఐటీడీపీ నాయకులు కురువ కృష్ణ, షఫీ, దస్తగిరి, యోహాను, రంగన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పత్తికొండ: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సుంకం గేట్, తేరు బజార్ కూడలిలలో పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : స్థానిక ఎంపీ కార్యాలయంలో టీడీపీ 43వ ఆవిర్భావం దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఎం.పి బస్తిపాటి నాగరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-గూడూరు: మండల వ్యాప్తంగా టీడీపీ 43వ ఆవిర్భావం దినోత్సవం వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం గూడూరు పట్టణంలో ఏర్పాటుచేసిన ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. గూడూరు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె.రామాంజనేయులు, టీడీపీ నాయకులు సీనియర్ నాయకులు బి.సృజన్, పౌలు, చాంద్బాషా తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర - తుగ్గలి: మండలంలోని గ్రామాలలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, ఎం.రామచంద్రలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -వెల్దుర్తి: మండల పరిధిలోని బింగు దొడ్డి, రత్నపల్లె, గ్రామాల్లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడ్ హాజరై టీడీపీ జెండాను ఎగరవేశారు. సూదేపల్లె జయరాముడు, అనకల కిట్టు, వడ్డెర సంఘం నాయకుడు వడ్డే మహేష్ బాబు, గిడ్డయ్య, హరి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కోడుమూరు: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంను కోడుమూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక షాదిఖన కాంప్లెక్స్ వద్ద టీడీపీ 232 బూత్ కన్వీనర్ రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేయి మల్లికార్జునగౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాలపాడు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

నిర్లక్ష్యం వహిస్తున్న హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కల్లుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, ఏఐ ఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. శనివారం పెద్ద కడబూరు లో వారు విలేకరులతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి పాఠశాలకు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువులు గాడి తప్పింద న్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఉసేనప్పకు హెచ్‌ఎంగా ఇంచార్జ్ ఇవ్వడంతో ఆయన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమయ పాలన పాటించకుండా పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారన్నారు. గత సంవత్సరం 24 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తే నలుగురు మాత్రమే ఉత్తీర్ణు లయ్యారని తెలిపారు. దీంతో పాఠశాలలో చదువు ఎంత నాణ్యత ఉందో అర్థమవు తుందన్నారు. మండల విద్యాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఇంచార్జ్ హెచ్‌ఎంను తొలగించి, రెగ్యులర్ హెచ్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు ఇస్మాయిల్, ఖలీల్, మహ్మద్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన వడ్డేగేరి సుంకులమ్మ దేవాలయం

విశాలాంధ్ర -వెల్దుర్తి: సంతాన ఫలాన్ని ఇచ్చే తల్లిగా భక్తుల నమ్మకాన్ని పొందిన వడ్డే గేరి సుంకులమ్మ తల్లి బోనాల ఉత్సవానికి ముస్తాబైంది. తెలుగు తొలి సంవత్సరాది పండుగ ఉగాదిని పురస్కరించుకుని చేసే ఈ బోనాల ఉత్సవం రెండ్రోజులు జరుగుతుంది. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వడ్డెర కులస్తులు ప్రత్యేకంగా ఈ బోనాల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ విధంగా వడ్డెర కులస్తులు అందరూ కలిసి అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో నేడు తొలి రోజు ఉగాది పర్వదినం ఉదయం 6 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం, హారతి నూతన వస్త్రా ధారణ జరుగుతుంది. అనంతరం ఏడు గంటల నుండి అమ్మవారికి బక్తులు తమ ఇంట్లో చేసుకున్న పిండి వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వల్లకిలో ఉంచుకొని మంగళ వాయిద్యాలతో, తప్పేట శబ్దాలతో గ్రామంలో ఊరేగింపు చేస్తారు. రెండవ రోజు గ్రామంలోని నాలుగు దిక్కుల్లో ఉన్న ఐదు బావుల్లో నుండి నీటిని తీసుకొని వచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం వడ్డెర కులస్తులంతా ప్రతి ఇంటి నుండి బోనాలను తీసుకొని వచ్చి తొలుత దళితవాడలోని మారెమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించి అక్కడ జంతుబలి చేస్తారు. అనంతరం సాయంత్రం మరోసారి ప్రతి ఒక్కరు తమ ఇంటి నుండి బోనాలను తీసుకొని వచ్చి పంతులమ్మ అమ్మవారికి సమర్పించి జంతువును బలి చేయడం జరుగుతుంది. ఆ తర్వాత కుమ్మరి కులస్తుల వద్ద నుండి ప్రత్యేకంగా తయారు చేసుకొచ్చిన కుండలలో అమ్మవారికి జొన్నలతో చలువ అన్నం చేసుకుని పెరుగుతో కలిపి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి చల్లబరుస్తారు. దీంతో ఉత్సవాలు ముగింపు అవుతాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఆలయ నిర్వాహకులు ఉచిత లడ్డు ప్రసాదలను అందించనున్నారు. వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 30, మార్చి 2025

రసభసగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల కేంద్రమైన క్రిష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం అన్ని శాఖల అధికారులతో వైస్ ఎంపీపీ బోయ సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం కాసేపు రస భసగా కొనసాగింది. తమ గ్రామంలో బెల్టు షాపులు తొలగించాలని మండలానికి మద్యం షాపు వస్తే అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం ఏమిటని సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్ ఎక్స్చేంజ్ ఎస్సై చంద్రమోహన్‌ను ప్రశ్నించారు. వెంటనే నాటు సారా, బెల్ట్ షాపులు లేకుండా అరికట్టాలన్నారు. గ్రామానికి గోకులం షెడ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు కట్టించుకోవడానికి వెళ్తే వాటిని తొలగించారని, మంజూరు చేయడం మీ ఇష్టమే, తొలగించడం మీ ఇష్టమేనా అని ఉపాధి ఏపీఓను సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్ అడిగారు. కటారుకొండ గ్రామంలో తాగునీటి ఎద్దడిని అరికట్టాలని సర్పంచ్ నక్కిలేని బాబు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. ఎస్టీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది పునరుద్ధరించాలి సచివాలయం నిర్మించా లని మండల అధికారులకు లెనిన్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్య వైద్యం ఉపాధి పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని వారికి సూచించారు. సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలన్నిటిని పరిష్కరి స్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఏఈ జాకీర్ హుస్సేన్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి హరినాథ్, ఎంఈఓ 2 మద్దయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్, సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపు ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని మల్యాల గ్రామానికి చెందిన వివోఏలు ఎ.శ్రీరాములు గౌడ్ దూదేకుల షఫీ లను అక్రమ తొలగింపును ఆవకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని వీవోల అధ్యక్షులు వి.యేసు రత్నం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు హెచ్చరించారు, శనివారం మల్యాల గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో అక్రమంగా తొలగించిన వివోఏలు ఎ.శ్రీరాములు గౌడ్, దూదేకుల షఫీ లను వెంటనే విధులకు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్యాల గ్రామంలో గత 27 సంవత్సరాల నుండి గ్రామంలో 72 పొదుపు లక్ష్మి గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి ద్వారా 30 రూపాయల పొదుపు నుండి 200 వందల పొదుపు వరకు ఎలాంటి అవినీతికి అక్రమాలకు పాల్పడకుండా నీతి నిజాయితీగా పనిచేసినటువంటి శ్రీరాములు గౌడ్ దూదేకుల షఫీ లను రాజకీయ కక్షతో తొలగించడం దారుణం అన్నారు, గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేయకుండా గ్రామ ఐక్య సంఘాలతో తీర్మానం చేయకుండా ఏపీఎం శ్రీనివాసులు అధికార పార్టీ నాయకులు మాటలు విని, వివోఏలను తొలగించడం సరైనది కాదన్నారు. గ్రామంలో కొంతమంది వ్యక్తులు దొంగ సంతకాలు, దొంగ స్టాంపులు సృష్టించి గ్రామంలో తీర్మానం చేసినామని తప్పుడు నివేదిక ఇవ్వడంతో వాటి ఆధారంగా వివోలను తొలగించామని ఏపీఎం చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గ్రామంలో గ్రామ సర్పంచ్ కూ,తెలపకుండా వివోలను తొలగించడం చాలా బాధా కరం అన్నారు. ఇప్పటికైనాపై అధికారులు స్పందించి మల్యాల గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా నీతి నిజాయితీగా చేసినటువంటి శ్రీరాములు గౌడు, దూదేకుల షఫీలను వెంటనే విధులకు తీసుకోవాలని వారు కోరారు, లేనిపక్షంలో గ్రామ ఐక్య సంఘాలుతో కలిసి నిరాహార దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆయన ఈ విషయాన్ని పీడీ దృష్టికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకురాలు మహేశ్వరమ్మ, నాయకులు పి.పక్కిరి సాహెబ్, టి.గోపాల కృష్ణ, వివో ఎలా సంఘం నాయకులు రమణ, సతీష్, జయమ్మ, ఎస్తేరమ్మ, ముర్తుజాభి, సలీమా బి.నజిమున్ బి.శకుంతలమ్మ, కే.రమణమ్మ, పకీరమ్మ, రంజాబి, రామేశ్వరమ్మ, ఎ.రేణుక, సరోజమ్మ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం అమావాస్య సందర్భంగ శనివారం భక్తుల తో కిటకిటలాడింది. పూజారి గిరి మల్లయ్య స్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు భక్తులు దూర ప్రాంతాల నుండి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవరగట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి. హొళగుంద సిద్దేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను వంశపరంపర్య రాజా పంపన గౌడ ఆధ్వర్యంలో నిర్వహించారు భక్తుల అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎల్లార్తి షేక్షావలి, షాషావలి, హెబ్బగుంద దాదా, చినిగి సాబ్ దర్గాలలో భక్తులుప్రత్యేక ఫాతిహాలు చదివించారు. ముజావర్లు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లాలో ఒకేషనల్ పదో తరగతి మార్చి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా నుండి దర ఖాస్తు 6339 విద్యార్థిని, విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వారిలో మొత్తం 6222 మంది విద్యార్థులు హాజరు అవ్వగా 117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను పర్యవేక్షించడానికి గాను జిల్లాలో, జిల్లా విద్యాశాఖాధికారి 4 పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారని, ఫ్లయింగ్ స్క్వాడ్లు 12 పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారని, సిట్టింగ్ స్క్వాడ్లు, 34 పరీక్షాకేంద్రాలను పర్యవేక్షించారని, ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సామెల్ పాల్ శనివారం తెలిపారు.

ఉగాది ఉత్సవాలకు మారెమ్మ గుడి ముస్తాబు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని మారెమ్మ గుడి ఉగాది వేడుకలకు ముస్తాబు అయినట్లు గ్రామ పంచాయితీ సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర, ఈవో అశ్విని కుమార్ తెలిపారు. మారెమ్మ గుడి సమీపంలోని డ్రైనేజీ కాలువలను పరిసరాలను శుభ్రం చేసి భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మారెమ్మ గుడికి తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. శిరివెళ్ల మండల కేంద్రంలో ఒకవైపు ఉగాది మరోవైపు రంజాన్ పండుగలు వరుసగా రావడంతో ఇటు మారెమ్మ గుడి వద్ద అటువైపు ఈద్గా ప్రార్థన మందిరం వద్ద పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఈవో అశ్విని కుమార్ పేర్కొన్నారు.

ఇరిగెల సోదరుల ఆధ్వర్యంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు ముందస్తు ఉగాది మరియు రంజాన్ మరియు ఉగాది శుభాకాంక్షలను జనసేన పార్టీ రాయలసీమ జోన్ ఎలక్షన్ కమిటీ సభ్యులు మాబు హుస్సేన్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రజలకు జనసేన పార్టీ తరవున తెలుగు కొత్త సంవత్సరం విశ్వా వసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ అలాగే రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి ఈద్ జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఆళ్లగడ్డ తాలూకా జనసేన నాయకులు ఇరి గలరాంపుల్లారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో జనసేన పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేస్తామన్నారు. ఆయనతోపాటు ఉయ్యాలవాడ మండలం జనసేన నాయకులు దూదేకుల కొట్లో బాబు, తాలూకా ఎస్సీ సెల్ నాయకులు దాలు రత్నమయ్య, ఎంపీ నగర్ కౌన్సిలర్ గురుమూర్తి ఉన్నారు.

డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డి
పదవి విరమణ వీడ్కోలు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో శనివారం మధ్యాహ్నం సర్జరీ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డి పదవీ విరమణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రెండ్రోజులపాటు అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు

విశాలాంధ్ర-కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ఆదివారం, సోమవారం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని కోడుమూరు సబ్ రిజిస్టర్ తేజోవతి రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఆదివారం, సోమవారం రెండు రోజులు సెలవు దినాలుగా ప్రకటించాలి.అయితే మార్చి నెల చివరి రోజులు కావడంతో పాటు ప్రజల విజ్ఞప్తి మేరకు ఆది,సోమవారం రోజులలో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

సంక్షేమ, రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: సొంత భూమి తగ్గిపోయి కౌలు రైతులుగా మారు తున్న కౌలు రైతుల కోసం రక్షణ, సంక్షేమ చట్టాలను తీసుకురావాలని సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వివిధ గ్రామాల సచివాలయాలలో ఏపీ రైతు సంఘం నాయకులు ఎల్లప్ప ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జునైద్ బాషను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : బైక్ ప్రమాదంలో గాయపడిన స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తమ్ముడు జునైద్ బాషను శనివారం ఆత్మకూరు పట్టణ ఇస్లాంపేటలోని వారి నివాసంలో శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు.

ప్రశాంతంగా ముగిసిన పంచాయితీ వేలం పాటలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం అయిన మహదేవాపురంలో గ్రామపంచాయతీ వేలం పాటలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గ్రామపంచాయతీ సర్పంచ్ పెద్ది రమణయ్య అధ్యక్షతన నిర్వహించిన వేలంపాటలకు డి ఎల్ పి ఓ రాంబాబు, ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసుల శర్మ, కార్యదర్శి బట్టు కుమార్ హాజరు అయ్యారు. రూ.6.51 లక్షలలకు శేఖర్ అధిక వేలంపాటలో కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శిరివెళ్ల పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అపుస్మా ఆధ్వర్యంలో ఉగాది ముందస్తు వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలోని కేపీజీ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం అధ్యక్షులు టి అమీర్ బాషా ఆధ్వర్యంలో విద్యార్థులను ఉగాది అక్షర క్రమంలో కూర్చోబెట్టి వినూత్నంగా వేడుకలను నిర్వహించారు. అమీర్ భాష మాట్లాడుతూ షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పండగ తెలుగువారికి ఎంతో విశిష్టమైనది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిఎండి రఫీ, నాగేంద్ర, మునవర్, మనోహర్, అశ్విని, విజయలక్ష్మి, పరిదా, సుమలత, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి ఆలయాలు ముస్తాబు

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని బొమ్మన గుండనహళ్లిలో ఆదివారం రామ మ్మ దేవి రథోత్సవం వైభవంగా జరుగుతుందని టీడీపీ యువ నాయకులు గిరి మల్లేష గౌడ, గ్రామ పెద్దలు శివ రుద్ర గౌడ, గుత్తి నాగరాజ్, హుసేనప్ప టీచర్, మండే అనుమన్న, బడిగేరు పాలాక్షి, వీరభద్రయ్య స్వామి, షా విందయ్య స్వామి, ఎంపీటీసీ శివన్న శనివారం తెలిపారు. రథోత్సవ సందర్భంగా దేవికి ప్రత్యేక పూజ లు చేస్తామని సాయంత్రం 6 గంటలకు దేవి రథోత్సవాన్ని అశేష భక్తుల నడుమ రతాన్ని లాగుతారని అన్నారు. రథోత్సవానికి భక్తులు, ప్రజలు, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రథోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బి వీరభద్ర గౌడ హాజరవుతారని అన్నారు. వందవాదలిలో దుర్గమ్మ దేవి రథోత్సవం సందర్భంగా దేవి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశామని అంగరంగ వైభవంగా దేవి రథోత్సవం జరుగుతుందని సర్పంచ్ కె.హనుమంతమ్మ తెలిపారు. పెద్ద గోనెహాలు సుంకులమ్మ అవ్వ, హెబ్బటంలో సవారమ్మ దేవి రథోత్సవం సందర్భంగ గ్రామ పెద్దలు, భక్తులు ఆలయాన్ని అన్ని రంగులకు ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చూస్తామని అన్నారు.

పారా లీగల్ వాలంటీర్‌లకు చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాద్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా న్యాయ సేవా సదన్ నందు పారా లీగల్ వాలెంట్రీస్ కు చట్టాలపై అవగాహన ఇవ్వడం జరిగింది. న్యాయ సేవల సహాయం కోసం మరియు న్యాయ సేవల విస్తృత ప్రచారం కోసం వీరిని ఉపయోగిస్తామని కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి తెలిపారు.పారా లీగల్ వాలంటీర్స్ విధులు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ హరినాథ్ పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ పారా లీగల్ వాలంటీర్స్ న్యాయ సేవలు అవసరం యైన వాళ్లకు న్యాయ సహాయం అందించడంలో తోడ్పాడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ విజయలక్ష్మి మహిళల రక్షణ గురించి, శక్తి ఎస్ఓఎస్ యాప్ గురించి పిల్లలు సెల్ ఫోన్ వాడకంపై తల్లి దండ్రులు పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో ప్యానెల్ న్యాయవాదులు, ప్యారా లీగల్ వాలెంటీర్స్ పాల్గొన్నారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర కర్నూలు - వైద్యశాల: నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ లెక్చరర్ హాల్లో జూనోటిక్ వ్యాధులపై శనివారం ఉదయం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని మైక్రో బయాలజీ విభాగధిపతి డాక్టర్ రేణుకా దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి మరియు ఈ జూనోటిక్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను సీఎం ఈ ప్రోగ్రాం ద్వారా సమర్థవంతంగా నివారించవ చ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ చక్రపాణి, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: న్యాయ సేవా అధికార సంస్థ వారు పెంచికలపాడు గ్రామం నందు గల గవర్నమెంట్ హై స్కూల్ ఆవరణలో పోక్సో యాక్ట్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా టి.లీలావతి, ఫ్యామిలీ కోర్ట్ జిల్లా జడ్జిలు హాజరయ్యారు. జడ్జీ మాట్లాడుతూ అక్కడి పిల్లలకు, మహిళా పోలీస్ లకు, అంగన్వాడీ కార్యకర్తలకు పోక్సో యాక్ట్ పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 ప్రకారం పిల్లల పై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ పోక్సో కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్ట్ కలదని తెలిపారు. పిల్లలకు ఏదైనా సమస్య వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్. 1098కి కాల్ చేసి చెప్పవచ్చు నని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్‌లు ఈ చట్టం గురించి ప్రజలలో అవగాహనా కల్పించాలని తెలిపారు. ఈ సదస్సు లో ఐసీడీస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, హెడ్ మాస్టర్ సాయి లీలా, టీచర్స్ విజయ కుమార్, పద్మావతి, అనురాధ, శ్రీలక్మి, నిక్షన్, శ్రీదేవి పాల్గొన్నారు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల తహశీల్దార్ పురుషోత్తముడు అన్నారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామా ల వీఆర్వోలతో సమావేశం నిర్వహించి, తహశీల్దార్ మాట్లా డుతూ ఆయా గ్రామాల వీఆర్వోలు తమ గ్రామాల్లో ఎండ తీవ్రత, వడగాల్పు లపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తప్ప కుండా వీఆర్వోలు గ్రామాలలో పర్యటిస్తూ చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త పడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని వీఆర్వోలను ఆదేశించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-గూడూరు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల తహశీల్దార్ కె.రామాంజనేయులు అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యా లయం ఆవరణంలో గూడూరు చైతన్య యూత్, మాజీ జెడ్పీసీఎల్ వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ కె.రామాంజనేయులు, డీటీ ధనుంజయ రెడ్డి ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్ సభ్యులు ములగేరి మద్దిలేటి, విశ్వనాథ ఆచారి, సాక్షి శ్రీనివాసులు, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్ రెడ్డి, వీఆర్వోలు కృష్ణారెడ్డి, జయరాముడు, మధు కృష్ణ, హరిరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డా.ఎం.హరికిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం

విశాలాంధ్ర - కర్నూలు: సామాజిక సమస్యల్ని పరిష్కరించడం కోసం, సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడం కోసం సాహిత్యాన్ని సాధనంగా మలచుకున్న హరికిషన్ తన రచనల ద్వారా పాఠకులకు సమాజంలో వుండే రుగ్మతలపట్ల అవగాహన కలుగచేస్తూ, చేయవలసిన కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాడు. సాహిత్యం ప్రయోజనం ఆనందం కలిగించడం మాత్రమే కాదు, సామాజిక స్పృహ పెంపొందిచడం గూడా అని పేర్కొనే హరికిషన్ 1972లో కర్నూలుజిల్లాలోని పాణ్యంలో కృష్ణవేణమ్మ, హుసేనయ్య దంపతులకు జన్మించారు. నగరంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం ప్రారంభించిన వీరు కర్నూలు పీజీ సెంటర్‌లో కేతు విశ్వనాథరెడ్డి కథలు - సామాజిక దర్శనం అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. కోడుమూరు మండలంలోని అమడగుంట్లలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం నిర్వర్తిస్తున్న హరికిషన్ పీజీలో వారి అధ్యాపకుడు, కథా రచయిత అయిన డా.తుమ్మల రామకృష్ణ సహచర్యం వల్ల సాహిత్య రచనపట్ల ఆసక్తి పెంపొందిచుకున్నారు. అప్పుడప్పుడే కర్నూలులో కథాసాహిత్యాన్ని, సామాజిక స్పృహగలిగిన రచయితల్ని పెంపొందించాలనే ఆశయంతో ఆవిర్భవించిన సాహితీ సంస్థ 'కథాసమయం'లో సభ్యులుగా చేరారు. రాప్తాడు గోపాలకృష్ణ, శ్రీనివాసమూర్తి, వెంకటకృష్ణ, శేఖర్, ఉమామహేశ్వర్ వంటి సాహితీమిత్రుల సహకారంతో, చర్చాగోష్టులతో కథారచనలో మెళకువలను అందిపుచ్చుకున్నారు. 1997లో ఫ్యాక్షన్‌కు వ్యతిరేకంగా రాసిన తొలికథ 'పడగనీడ' ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత తనను నిరంతరం ఘర్షణకు లోను చేస్తున్న అనేక సామాజిక సమస్యలపట్ల స్పందిస్తూ 13 కథలతో మాయమ్మ రాచ్చసి అనే కథా సంపుటిని,అలాగే కర్నూలు జనజీవితాన్ని ప్రతిబింబించే 22 కథలతో కందనవోలు కథలు అనే కథా సంపుటాన్ని ప్రచురించారు. మతం గురించి మాట్లాడడానికి, విమర్శించడానికి అనేకులు జంకుతున్న తరుణంలో అన్ని మతాలలోని లోపాలను ఎత్తిచూపుతూ నయాఫత్వా, మూడు అబద్దాలు అనే పుస్తకాలు ప్రచురించడం ద్వారా అనేక మంది సాహితీ విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.

చిన్నారుల పట్ల అత్యంత ప్రేమ కలిగిన హరికిషన్ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న బాధల్ని, మార్కుల ప్రపంచంలో కను మరు గవుతున్న పిల్లల హక్కుల్ని, ప్రయివేట్ పాఠశాలలు కొన సాగిస్తున్న దోపిడీని నిరసిస్తూ, బాలల స్వేచ్ఛా ప్రపంచాన్ని కలగంటూ 'ఒక చల్లని మేఘం' అనే కథాసంపుటిని ప్రచురించారు. ఆ తరువాత చదువరుల మనస్సులు అర్ద్రమయ్యేలా భర్తను కోల్పోయిన తన తల్లి చేసిన జీవిత పోరాటాన్ని, తన బాల్యాన్ని కలిపి కథలుగా మలచి నేనూ మా అమ్మ అనే పుస్తకాన్ని హృద్యంగా రచించారు. కర్నూలు జిల్లాలో వుండే కథకుల్ని, వారి కథలను పరిచయం చేస్తూ కర్నూలు కథ అనే బృహత్ సంకలనాన్ని సంపాదకుడిగా వెలువరించారు. కర్నూలు బుక్ ట్రస్ట్ పేరుతో ఒక ప్రచురణ సంస్థను నెలకొల్పి అనేక పుస్తకాలు ప్రచురించారు.

జానపద బాల సాహిత్యం: డా.ఎం.హరికిషన్ తరతరాలనుంచి ఒకరినుంచి మరొకరికి మౌఖికంగా సంక్రమిస్తున్న జానపద బాలసాహిత్యం అంతరించి పోగూడదని అనేక పల్లెటూళ్ళు తిరుగుతూ అమ్మమ్మల్ని, తాతయ్యల్ని పలకరిస్తూ వారినుంచి కథల్ని సేకరించాడు. హరికిషన్ పిల్లలు మాట్లాడుకునే భాషలో అత్యంత సరళంగా, పిల్లలు తమంతట తాము చదువుకునేలా రాయడంలో సిద్ధహస్తులు. సరళ కర్నూలు మాండలికంలో వీరి జానపద కథలు కొనసాగుతూ పిల్లల్ని సమ్మోహితుల్ని చేస్తున్నాయి. ఠింగురుబిళ్ళ, కిర్రు కిర్రులొడ్డప్పా, ఒకటితిందునా రెండుతిందునా, నక్కబావ - పిల్లిబావ, కుందేలు దెబ్బ, నల్లకుక్క, నలుగురు మూర్ఖులు, నాకు మూడు నీకురెండు ఇలా అనేక సంపుటాలు ప్రచురించారు. విశాఖపట్టణం జిల్లా పాడేరు ప్రాంతంలోని ఆదివాసీ భాష కొండకు లిపిలేదు. ఆ భాషలోని జానపద కథలు కొన్ని సేకరించి బంగారు చేప - గంధర్వకన్య పేరుతో మన తెలుగువారికి అందించారు. ఇటీవలే 2017లో 121 జానపద కథలతో కర్నూలు జిల్లా జానపద కథలు అనే పెద్ద సంపుటాన్ని ప్రచురించారు

రాయలసీమ కథల సంకలనాలు : రాయలసీమలో రచయితలు రచించిన మంచి కథలు సాహితీపాఠకులకు అందించడం కోసం సాహిత్యాన్ని వివధ వర్గాలుగా విభజిస్తూ రాయలసీమ రచయిత్రుల కథలు, రాయలసీమ ప్రేమ కథలు, రాయలసీమ కరువు కథలు, రాయలసీమ హాస్య కథలు, రాయలసీమ వ్యంగ్య కథలు, రాయలసీమ ఉపాధ్యాయ కథలు, రాయలసీమ వృత్తి కథలు అనే సంకలనాలు ప్రచురించారు.

ప్రయోగాలు: తెలుగు భాషలో అప్పుడప్పుడే అక్షరాలు దిద్దుతూ, చదవడం నేర్చుకుంటున్న చిన్నారులు గూడా పుస్తకాలు చదవాలనే తపనతో హరికిషన్ ఒత్తులులేని గేయాలు, సంయుక్త అక్షరాలు లేని కథలు, బొమ్మలతో సామెతలు, జానపద గేయాలు అత్యంత సరళమ్మైన భాషలో సృష్టించి ఒక కొత్త ఒరవడికి బాటలు వేశారు. రేవటి వెలుగులు, మెరుపుల వాన తెలుగుభాషలో వచ్చిన మొట్టమొదటి ఒత్తులులేని గేయాల పుస్తకాలు. తిక్క కుదిరిన నక్క, మూతిపగిలిన పిల్లి, పిండిబొమ్మ వీరుడు, కందిరీగ తేనెటీగ సంయుక్త అక్షరాలే లేకుండా రంగురంగు బొమ్మలతో ఆకర్షణీయంగా ప్రచురించారు. సమ్యుక్త అక్షరాలు లేకుండా తెలుగులో మొట్టమొదటిసారిగా మిన్ను అనే బాలల నవల రచించారు. సర్వశిక్షా అభియాన్ బాలసాహిత్య స్టేట్ టీంలో సభ్యులుగా వున్న వీరు కర్నూలు జిల్లాలో బాలసాహిత్య రూపకల్పనకు మార్గదర్శకులుగా వుండి అనేక పుస్తకాలు రూపొందించారు. కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలోనూ వీరు రచించిన పుస్తకాలు కనబడతాయి.

చరిత్ర పుస్తకాలు : కర్నూలు జిల్లా చరిత్రను ఆదిమానవులు ఈ జిల్లాలో అడుగు పెట్టినప్పటి నుంచి 1956లో ఆంధ్ర రాజధాని కర్నూలు నుండి హైదరాబాదుకు తరలిపోయేదాకా జరిగిన విషయాలన్నీ పిల్లల నుంచీ పెద్దలవరకు అందరికీ అర్థమయ్యే రీతిలో, అరుదైన 250 ఫొటోల సహాయంతో వివరించారు. ఇంతవరకు వెలుగు చూడని కొండారెడ్డి బురుజు పాత ఫొటోలను సేకరిస్తూ కొండారెడ్డి బురుజు చరిత్ర వెలువరించారు. కర్నూలు జిల్లా మహనీయులు అనే పేరుతో 20 మంది మొదటితరానికి చెందిన గొప్పవారి ఫొటోలను చిత్రకారులతో వేయించి వారిని గురించి వివరిస్తూ పుస్తకాన్ని రూపొందించారు.